# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక




పండుగ సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. కావున బుధవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం గురువారం.


సంపుటి: 2 | సంచిక: 279 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 14 జనవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


## కిషన్ రెడ్డి నివాసంలో

# ఘనంగా సంక్రాంతి వేడుకలు

### ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని మోడీ, స్పీకర్ ఓం బిర్లా

### చిరంజీవి, పలువురు కేంద్రమంత్రులు, నేతల రాక





న్యూఢిల్లీ,జనవరి13(ప్రభాత ఉదయం): తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. రంగురంగుల రంగవల్లులతో గ్రామాలు, పట్టణాలు ముస్తాబు కాగా.. కోడి పందేలు, ఎడ్ల పందేలతో పండగను ఘనంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఇంట్లో సంక్రాంతి సంబరాలు హోరెత్తిపోతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలోని ఆయన నివాసంలో సోమవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు పలువురు కేంద్ర మంత్రులు, సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ వేడుకల్లో స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసరాజు, సినీనటుడు చిరంజీవి, ఏఐజీ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, పీవీ సింధు వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను మోదీ వీక్షించారు. గాయని సునీత పాటలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి వెంకటేశ్వరస్వామి ప్రతిమను కిషన్‌రెడ్డి అందజేశారు. ఎంపీలు లక్ష్మణ్, అనురాగ్ ఠాకూర్, ఈటెల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు, లక్ష్మణ్, గోడెం నగేష్, బాలశౌరి, కొండ విశ్వేశ్వర్ రెడ్డి , డి.కె.అరుణ సహా పలువురు తెలంగాణ బీజేపీ నేతలు సైతం వేడుకలో పాల్గొన్నారు. అలాగే లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, జ్యోతి రాధిత్య సింధియా, మనోహర్ లాల్ కట్టర్, పెమ్మసాని చంద్రశేఖర్, బండి సంజయ్, సతీశ్ చంద్ర దూబే, శ్రీనివాస్ వర్మ హాజరయ్యారు. మరోవైపు పలువురు ఎంపీలు, పారిశ్రామికవేత్తలు, బీజేపీ నేతలు కిషన్ రెడ్డి నివాసానికి భారీగా చేరుకున్నారు. కేంద్ర మంత్రి నివాసానికి చేరుకున్న ప్రధాని మోదీకి కిషన్ రెడ్డి, చిరంజీవి, పెమ్మసాని చంద్రశేఖర్ సాదర స్వాగతం పలికారు. సంక్రాంతి వేడుకల నేపథ్యంలో తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా కిషన్ రెడ్డి ఇంటిని ముస్తాబు చేశారు. అతిథులకు తెలుగు వంటలను సైతం రుచి చూపించేలా పలు వంటకాలను సిద్ధం చేశారు.



## జడ్ మోడ్ సొరంగాన్ని ప్రారంభించిన

# ప్రధాని మోదీ

### పటిష్ట భద్రతను ఏర్పాటు చేసిన అధికారులు
### జడ్ మోడ్ సొరంగం పొడవు 6.5 కిలోమీటర్ల
### టన్నెల్ నిర్మాణం కోసం ఏకంగా రూ.2,500 కోట్లు ఖర్చు

న్యూఢిల్లీ, జనవరి 13 (ప్రభాత ఉదయం): ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం జమ్ముకశ్మీర్‌లోని సోన్‌మార్గ్ ప్రాంతంలో జడ్ మోడ్ సొరంగాన్ని ప్రారంభించారు. ప్రధాని రాక నేపథ్యంలో జమ్ముకశ్మీర్‌లో అధికారులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. టన్నెల్ ప్రారంభోత్సవంలో జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తదితరులు పాల్గొన్నారు. శ్రీనగర్ నుంచి కార్గిల్ వెళ్లే దారిలో శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారిపై ఈ టన్నెల్‌ను నిర్మించారు. ఈ టన్నెల్ నిర్మాణం కోసం ఏకంగా రూ.2,500 కోట్లు ఖర్చు ..మిగతా 2లో



## సందడిగా

# కైట్ ఫెస్టివల్

### చిన్న పెద్ద తేడా లేకుండా వేడుకల్లో పాల్గొన్న ప్రజలు

హైదరాబాద్, జనవరి 13 (ప్రభాత ఉదయం): సంక్రాంతి పండుగ అంటే ముందుగా గుర్తుకు వచ్చేది ముగ్గులు.. ఆ తరువాత పతంగులు. సంక్రాంతి సందర్భంగా యువత ఎంతో ఉత్సాహంగా కైట్స్ ఎగురవేస్తుంటారు. మహిళలు ఇంటి ముందు పెద్ద పెద్ద ముగ్గులతో పండుగను జరుపుకోగా.. మగవారు పతంగులు ఎగురవేస్తూ ఆడి పాడి ఎంజాయ్ చేస్తుంటారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా పతంగులు ఎగురవేస్తుంటారు. అలాగే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పలు చోట్ల కైట్స్ ఫెస్టివల్స్‌ను నిర్వహిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు అక్కడకు చేరుకుని పతంగులు ఎగురవేస్తారు. ఒకరితో ఒకరు పోటీ పడి మరీ గాలిపటాలను ఎగురవేస్తారు. వివిధ రకాల పతంగులు ప్రస్తుతం మార్కెట్లలో లభిస్తున్నాయి. ఇక చిన్న పిల్లల జోష్ మామూలుగా ఉండదు. ఇంట్లోని తమ తండ్రి, అన్నలతో కలిసి పిల్లలు కైట్స్‌ను ఎగురవేస్తూ ఆనందిస్తుండగా.. యువత తమ స్నేహితులతో కలిసి పతంగులు ఎగురవేస్తారు. అలాగే కైట్స్ ఫెస్టివల్‌ను డీజే మోతతో హెూరెత్తిస్తుంటారు. మరోవైపు హైదరాబాద్‌లో పతంగుల సందడి మొదలైంది. సిటీలోని పలు ప్రాంతాల్లో కైట్స్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. డీజే హెూరు మధ్య భవనాలపై పతంగులు ఎగురుస్తున్నారు యువత. పోటాపోటీగా పతంగులు ఎగరేస్తూ యువత సందడి చేస్తోంది. బోయినపల్లిలో ఏర్పాటు చేసిన కైట్ ఫెస్టివల్‌లో చిన్నారులతో కలిసి మాజీ మంత్రి మల్లారెడ్డి పతంగులు ఎగిరవేశారు. మరోవైపు హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు 7వ అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ జరగనుంది. అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌ను రాష్ట్ర పర్యాటక, భాషా సాంస్కృతిక ..మిగతా 2లో

# ఆ సర్వే ఆధారంగానే కొత్త రేషన్ కార్డుల జారీ!

### ఈ నెల 26 నుంచి రేషన్ కార్డుల మంజూరుకు ఉత్తర్వులు జారీ చేసిన పౌరసరఫరాల శాఖ

### ముసాయిదా జాబితాను గ్రామసభ, వార్డులో ప్రదర్శించి చదివి వినిపించి చర్చించిన తర్వాతే ఆమోదం

హైదరాబాద్, జనవరి 13 (ప్రభాత ఉదయం): కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు సంబంధించిన మార్గదర్శకాలను తెలంగాణ ప్రభుత్వం ఎట్టకేలకు విడుదల చేసింది. ఈనెల 26 నుంచి రేషన్ కార్డుల మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వులను జారీ చేసింది. రేషన్ కార్డుల అర్హత ప్రమాణాల పరిశీలనకు ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది. ఉపసంఘం నిర్ణయాల ప్రకారమే రేషన్ కార్డుల జారీ జరుగుతుంది. ఇటీవల జరిగిన కుల గణన సర్వే ఆధారంగానే ..మిగతా 2లో



## తెలుగు ప్రజలందరికీ సీఎం రేవంత్ రెడ్డి

# సంక్రాంతి శుభాకాంక్షలు



హైదరాబాద్, జనవరి 13 (ప్రభాత ఉదయం): తెలుగు ప్రజలందరికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగ భాగ్యాలను అందించే భోగి.. కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి.. కనుమ పండుగలను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని దాదాపు కోటి మంది రైతులు, నిరుపేదలు, వ్యవసాయ కూలీ కుటుంబాల్లో ఈ పండుగ కొత్త వెలుగులు తెస్తుందని అన్నారు. రైతు భరోసాను రూ.12 వేలకు పెంచటంతో పాటు వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నగదు సాయం, ఆహార భద్రతను అందించే కొత్త రేషన్ కార్డులు, గూడు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసే నాలుగు సంక్షేమ పథకాల అమలుకు సంక్రాంతి పండుగ నాంది పలుకుతోందని అన్నారు. ప్రతి సంక్షేమ పథకం అర్హులైన వారందరికీ చేరాలనేది తన సంకల్పమని ముఖ్యమంత్రి అన్నారు. వ్యవసాయంతో పాటు ఉపాధి కల్పన, పారిశ్రామిక రంగాలన్నింటా తెలంగాణ రాష్ట్రం తిరుగులేని పురోగమనం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. స్వేచ్ఛా సౌభాగ్యాలతో ప్రజలందరూ సంతోషంగా తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి పండుగ సంబురాలు జరుపుకోవాలని అన్నారు. పతంగులు ఎగరవేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డిపై

# మూడు కేసులు నమోదు



కరీంనగర్, జనవరి 13 (ప్రభాత ఉదయం): బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి పండుగపూట బిగ్ షాక్ తగిలింది. ఆయనపై పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. కరీంనగర్ వన్ టౌన్ పీఎస్‌లో ఈ కేసులు నమోదు అయ్యాయి. కరీంనగర్ ఆర్డీవో, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పీఏల ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ యాక్టు 132, 115 (2), 352,292 కింద కేసులు నమోదు అయ్యాయి. మరో ఫిర్యాదు ..మిగతా 2లో



## జడ్ మోడ్ సొరంగాన్ని ప్రారంభించిన
# ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి...

చేశారు. భారత రక్షణ రంగానికి వ్యూహాత్మకంగా ఈ టన్నెల్ చాలా కీలకం కానుంది. ఈ జడ్ మోడ్ సొరంగం 6.5 కిలోమీటర్ల పొడవు ఉంది. ఈ టన్నెల్ ద్వారా ఏ సీజన్‌లోనైనా లడఖ్‌కు చేరుకోవడానికి వీలవుతుంది. టన్నెల్‌కు సంబంధించి 2015లో ప్రారంభమైన నిర్మాణ పనులు గత ఏడాది పూర్తయ్యాయి. ఈ జెడ్ మోడ్ టన్నెల్ భారత్‌కు వ్యూహాత్మకంగా చాలా కీలకమైనది. దాదాపు సముద్రమట్టానికి 8,500 అడుగుల ఎత్తులో దీన్ని నిర్మించారు. అత్యంత శీతలమైన లడఖ్‌ను ఏ సీజన్‌లో అయినా సందర్శించేందుకు ఈ టన్నెల్ ఉపయోగపడనుంది. ఈ సొరంగం రవాణా వ్యవస్థతోపాటు రక్షణ వ్యవస్థకు కూడా కీలకం కానుంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ సోనామార్గ్ పట్టణానికి టన్నెల్ ద్వారా వెళ్లొచ్చు. జమ్ముకశ్మీర్‌లో 'జడ్ మోడ్' టన్నెల్ ఏర్పాటుతో కార్గిల్ మరింత సురక్షితంగా మారింది. గతంలో కార్గిల్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదులు దుశ్చర్యలకు పాల్పడగా భారత్ ఏకంగా యుద్ధమే చేయాల్సి వచ్చింది. శీతాకాలంలో తీవ్రంగా మంచు కురిసే సమయాన్ని ఆసరా చేసుకుని ఉగ్రవాదులు భద్రతాబలగాలపై దాడులకు తెగబడ్డారు. అప్పట్లో కార్గిల్ ప్రాంతం పాకిస్థాన్ ఉగ్రవాదుల హస్తగతమైతే శ్రీనగర్ లేహ్ మధ్య రాకపోకలు నిలిచిపోయేవి. ఇప్పుడు సొరంగం ద్వారా సైన్యం కార్గిల్‌కు వేగంగా చేరుకునే అవకాశం ఉంది.

## ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డిపై
# మూడు కేసులు నమోదు

మొదటి పేజీ తరువాయి...

ఆధారంగా 126 (2),115(2) పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కరీంనగర్ జిల్లా సమీక్షా సమావేశం రసాభాసగా మారింది. సమావేశంలో ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, సంజయ్ కొట్టుకున్నారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన సందర్భంగా జిల్లా సమీక్షా సమావేశంలో ప్రభుత్వ పథకాలపై చర్చ జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సహా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మైక్ తీసుకుని మాట్లాడే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన కౌశిక్ రెడ్డి నువ్వు ఏ పార్టీ అంటూ సంజయ్‌ను ప్రశ్నించారు. దమ్ముంటే కాంగ్రెస్ టికెట్‌పై గెలవాలని సవాల్ చేశారు. దీంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. వాగ్వాదం కాస్తా ముదిరి ఇద్దరూ ఒకరిపై మరొకరు చేయి చేసుకున్నారు. మంత్రుల ఎదుటే కొట్టుకున్నారు. దీంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు కౌశిక్ రెడ్డిని కలెక్టరేట్ నుంచి బలవంతంగా బయటకు లాక్కెళ్లారు. వివాదం నేపథ్యంలో అక్కడంతా గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. కాగా, బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా మాట్లాడడం ఏంటని కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. మరోవైపు కౌశిక్ రెడ్డి ఎక్కడుంటే అక్కడ వివాదాలు ఉంటాయని కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## లాస్ ఎంజిల్స్‌లో
# అదుపులోకి రాని కార్చిచ్చు


**ఇప్పటి వరకు 24మంది దుర్మరణం**

**న్యూ ఇయర్ వేడుకల బాణాసంచా కొంపముంచింది**

**పలు కోణాల్లో దర్యాప్తు ముమ్మరం**

లాస్‌ఏంజిల్స్,జనవరి13(ప్రభాత ఉదయం): అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో కార్చిచ్చు వ్యాప్తి కొనసాగుతోంది. వేగంగా వీస్తున్న గాలులతో మంటలు కొత్త ప్రాంతాలకు వ్యాపిస్తున్నాయి. దీంతో వేలాది ఇండ్లు కాలి బూడిదవుతున్నాయి. లక్షల కోట్ల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లుతోంది. ప్రాణనష్టం సైతం క్రమంగా పెరుగుతోంది. ఇప్పటి వరకూ అందిన సమాచారం ప్రకారం.. కార్చిచ్చులో మరణించిన వారి సంఖ్య 24కు పెరిగింది. మరణించిన వారిలో అత్యధికంగా ఏటోన్ ÷ర్‌లోనే 16 మంది కాగా, పాలిసేడ్స్‌లో 8 మంది ఉన్నారు. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇక ఈ అగ్ని ప్రమాదాల్లో సుమారుగా 16 మంది తప్పిపోయినట్లు స్థానిక మీడియా నివేదించింది. మంటల ధాటికి ఇప్పటి వరకూ 12,000 నిర్మాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. అంతేకాదు, పాలిసేడ్స్‌లో 23,707, ఏటోన్‌లో 14,117ఎకరాలు, కెన్నెత్‌లో 1,052, ముర్సెట్‌లో 779 ఎకరాలు దగ్ధమైనట్లు పేర్కొంది. మంటలను ఆర్పేందుకు కాలిఫోర్నియాతో పాటు అమెరికాలోని తొమ్మిది నగరాలు, మెక్సికోకు చెందిన అగ్నిమాపక బృందాలు పని చేస్తున్నాయి. కాగా, లాస్ ఏంజెల్స్‌లో నివసించే హాలీవుడ్ నటులు వారికి కేటాయించిన నీటి కంటే ఎక్కువ వినియోగించుకున్నారని, దీంతో ఇప్పుడు మంటలు ఆర్పేందుకు నీటి కొరత ఏర్పడిందని మర్శలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా చరిత్రలోనే ఇది అత్యంత వినాశకరమైన ప్రకృతి వైపరీత్యమని కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసోమ్ అన్నారు. కార్చిచ్చు కొత్త ప్రాంతాలకు వ్యాపిస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది. ప్రస్తుతం పాలిసేడ్స్ అగ్ని బ్రెంట్‌వుడ్ వైపు మళ్లింది. ఈ ప్రాంతంలో అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌తో పాటు పలువురు క్రీడాకారులు, నటీనటుల ఇండ్లు ఉన్నాయి. దీంతో ఉపాధ్యక్షురాలి హోదాలో చేయాల్సిన తన చివరి విదేశీ పర్యటనను కమలా హారిస్ రద్దు చేసుకున్నారు. మరోవైపు అమెరికాలోని టెక్సాస్, ఓక్లహోమా, మరికొన్ని రాష్ట్రాలను మంచు తుఫాను అతలాకుతలం చేస్తున్నది.లాస్ ఏంజెలెస్‌లోని కార్చిచ్చుల వ్యాప్తి కొనసాగుతూనే ఉంది. కొన్ని చిన్న మంటలను అదుపు చేసినా.. పాలిసేడ్స్, ఏటోన్ ప్రాంతాల్లో వ్యాపించిన మంటలను మాత్రం పూర్తిస్థాయిలో అదుపు చేయలేకపోతున్నారు. మరోవైపు నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కాల్చిన బాణాసంచాతోనే ఇది మొదలైనట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటివరకు ఈ అగ్ని ప్రమాదాల్లో మరణించిన వారి సంఖ్య 24కు చేరింది. అత్యధికంగా ఏటోన్ ఫైర్‌లోనే 16 మంది ప్రాణాలు కోల్పోగా.. పాలిసేడ్స్‌లో 8 మంది మరణించారు. ఈ సంఖ్య మరింత పెరగవచ్చని అధికారులు చెబుతున్నారు. అగ్నికీలల వ్యాప్తిని నెమ్మదింపజేయడానికి కొన్ని రసాయనాలు కలిపిన ఫోస్ చెక్ అనే మిశ్రమాన్ని దాదాపు 9 విమానాలు, 20 హెలికాప్టర్ల సాయంతో నగరంపై వెదజల్లుతున్నారు. పింక్ రంగులో ఉన్న ఆ పదార్థం అక్కడి నిర్మాణాలు, మొక్కలపైనా అవి పడి అగ్నికీలల వ్యాప్తిని నెమ్మదింపజేస్తుంది. దీనిలోని అమ్మోనియం పాలీఫాస్ఫేట్ అంతవేగంగా ఆవిరి కాదు. దేనిమీదైనా పడితే సుదీర్ఘకాలం ఉండిపోతుంది. ఇది వృక్షాలపై పడి.. అగ్నికి ఆక్సిజన్ అందకుండా చేయడంతో అవి వేగంగా వ్యాపించలేవు. లాస్ ఏంజెలెస్‌లో అతిపెద్దదైన పాలిసేడ్స్ ఫైర్ కారణం న్యూఇయర్ వేడుకలని అనుమానిస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా కాల్చిన టపాసులతో అంటుకొని అక్కడ అగ్నిప్రమాదం జరిగింది. దానిని ఆర్పినా.. మిగిలిన నిప్పునకు బలమైన గాలులు తోడు కావడంతో కార్చిచ్చు రాజుకొన్నట్లు అనుమానిస్తున్నారని వాషింగ్టన్ పోస్టు కథనంలో పేర్కొంది. ఉపగ్రహ చిత్రాలు, రేడియో కమ్యూనికేషన్లు, స్థానికులను ఇంటర్వ్యూ చేసిన అనంతరం పాలిసేడ్స్ ఫైర్ అక్కడే మొదలైందని ఆ పత్రిక చెబుతోంది. సంపన్న ప్రాంతమైన పాలిసేడ్స్ సహా ఇతర ప్రాంతాల్లో విలువైన వస్తువులను వదిలేసి చాలా ఇళ్లు ఖాళీ చేశారు. దొంగలకు అవే లక్ష్యంగా మారుతున్నాయి. ఇప్పటివరకు 29 మంది దొంగలను అరెస్టు చేసినట్లు లాస్ ఏంజెలెస్ కౌంటీ షరీఫ్ రాబర్ట్ లూనా వెల్లడించారు. వీరిలో ఒకరు ఏకంగా అగ్నిమాపక సిబ్బంది దుస్తుల్లో అక్కడ సంచరిస్తున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం ఖాళీ ఇళ్లను కాపాడేందుకు 400 మంది నేషనల్ గార్డ్స్‌ను ఇక్కడ మోహరించారు. ఇక ఇటీవల కెన్నెత్‌ను అంటించినట్లు అనుమానిస్తున్న వ్యక్తి మెక్సికో నుంచి వచ్చిన అక్రమ వలసదారుడిగా గుర్తించారు.

# సందడిగా కైట్ ఫెస్టివల్



మొదటి పేజీ తరువాయి...

శాఖ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈరోజు సాయంత్రం 4 గంటలకు నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో కైట్ ఫెస్టివల్ ప్రారంభమవగా.. దాదాపు 19 దేశాల నుంచి 47 మంది ఇంటర్నేషనల్ ప్రొఫెషనల్ కైట్ ప్లైయర్స్ ఫెస్టివల్‌లో పాల్గొననున్నారు. అలాగే14 రాష్ట్రాల నుంచి కైట్ ఫెస్టివల్‌లో 54 మంది నేషనల్ ప్రొఫెషనల్ కైట్ ప్లైయర్స్ పాల్గొంటారు. పతంగుల పండుగకు ఇండోనేషియా, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, శ్రీలంక, కెనడా, కంబోడియా, స్కాట్లాండ్, థాయిలాండ్, కొరియా, ఫిలిప్పీన్స్, వియత్నాం, మలేషియా, ఇటలీ, తైవాన్, సౌత్ ఆఫ్రికా, నెదర్లాండ్స్, తదితర దేశాలకు చెందిన 50 మంది కైట్ ప్లైయర్స్ హాజరుకానున్నారు. అలాగే గుజరాత్, పంజాబ్, తమిళనాడు, కేరళ, హరియాణా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాలకు చెందిన 60 మంది క్రీడాకారులు తరలిరానున్నారు. ఈ మూడు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కైట్ ఫెస్టివల్ జరుగనుంది.

# మరెక్కడా లేని విధంగా తెలంగాణ పథకాలు

**రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలకు 45 వేల కోట్ల ఖర్చు**

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడి**



ఖమ్మం,జనవరి13(ప్రభాత ఉదయం): ప్రజా సంక్షేమం కోసం దేశంలో ఎక్కడ కూడా తెలంగాణలో ఉన్నటువంటి వంటి పథకాలు లేవని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రైతు రుణం, ధాన్యం బోనస్ చారిత్రాత్మకమైన పథకాలు తెలంగాణ సర్కార్ ఇస్తుందన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలకు 45 వేల కోట్ల రూపాయాలు ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఖమ్మం జిల్లాలో మల్లు భట్టి విక్రమార్క పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసాకు 19 వేల కోట్ల రూపాయలు.. ఆత్మీయ భరోసాకు 2 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇక, ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అన్ని పథకాలను అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. ప్రతి స్కీంలో కన్ఫ్యూజన్ ఏం లేదు.. పథకాలపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నాం.. అలాగే, ఉపాధి హామీ పథకంలో సభ్యులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హులు అని వెల్లడించారు. ఇందులో సెంట్ భూమి లేని వారికి వర్తిస్తుంది అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన స్పష్టత ప్రభుత్వం దగ్గర ఉంది. అధికారులు ఇందిరమ్మ కమిటీలు సమన్వయంతో పని చేయాలి అని సూచించారు. గ్రామాల్లో గ్రామసభ డయాస్ ఏర్పాటు చేసి చర్చించాలి.. గ్రామాల్లో ముడు చోట్ల ఫ్లెక్సీలని ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.



రాజేంద్రనగర్‌లో పార్లమెంటు మాజీ సభ్యులు డాక్టర్ మందా జగన్నాథం చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

# పార్లమెంటు మాజీ సభ్యులు మందా జగన్నాథంకు నివాళులర్పించిన నాయకులు

బుద్వేల్, జనవరి13 (ప్రభాత ఉదయం): పార్లమెంటు మాజీ సభ్యులు మందా జగన్నాథం మృ తి అట్టడుగు వర్గాల ప్రజలకు తీరని లోటని రాజేంద్రనగర్ సర్కిల్ బాబు జగ్జీవన్ రాం , డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటి సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అన్నారు. మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్ రావు ఆధ్వర్యంలో సోమవారం రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో మందా జగన్నాథం చిత్రపటానికి పూల మాలలు వేసి ఆయన కుటుంబానికి సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు కె.శంకర్ రావు , దేశాల భూపాల్, వి.ప్రీతమ్ రాజు, వీర్లపల్లి నవీన్, ప్రత్యార నర్సింహ్మా, గొడుగు సంజీవ, ఎం.రాములు, టి.సంతోష్, ఎం.పెంటయ్య, పి. భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


# పేదల సొంత ఇంటి కల నెరవేరబోతోంది

**పేదలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తోంది**

**మోడల్ ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన పొంగులేటి**




ఖమ్మం,జనవరి13(ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కల నెరవేరబోతోందని రాష్ట గృహ నిర్మాణ, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. . తెలంగాణ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తోందని అన్నారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గం కుసుమంచిలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇళ్లను సోమవారం ప్రారంభించారు. రూ. 5 లక్షల వ్యయంతో నిర్మించిన ఇంటిని మంత్రి శ్రీనివాస రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఎన్ని కుట్రలు, ఎన్ని ఆటంకాలు ఎదురైనా పేదల కల నెరవేర్చుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో రాజకీయాలు, కులమతాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. ఒక్క రూపాయి ఎవరికీ ఇవ్వాల్సిన పని లేదని స్పష్టం చేశారు. కేవలం పేదవారయితే చాలు ఇందిరమ్మ ఇల్లు వస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు నిరంతర పక్రియ అని చెప్పారు. సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్రంలో పేదవాడికి తీయని కబురు చెబుతున్నామని అన్నారు. త్వరలోనే అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయబోతున్నామని అన్నారు. నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగబోతోందన్నారు. రైతులకు రైతు బంధు పథకం ద్వారా ఎకరాకు రూ. 12 వేలు ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన పేదలకు రేషన్ కార్డు ఇవ్వబోతున్నామని చెప్పారు. రాష్ట్రంలో భూమి లేని నిరుపేదలకు దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇందిరమ్మ భరోసా పథకం ధ్వారా రూ.12 వేలు రెండు విడతలుగా ఇవ్వబోతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.



# భారత్‌లో పెరుగుతున్న హెచ్‌ఎంపీవీ వైరస్ కేసులు

న్యూఢిల్లీ, జనవరి 13 (ప్రభాత ఉదయం): భారత్‌లో హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా మరోచిన్నారి ఈ వైరస్ బారిన పడింది. పుదుచ్చేరికి చెందిన చిన్నారికి హెచ్‌ఎమ్‌పీవీ వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఆరోగ్య శాఖ అధికారి రవిచంద్రన్ తెలిపిన వివరాల ప్రకారం.. సదరు చిన్నారి జ్వరం, దగ్గు, జలుబుతో ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో చేరినట్లు తెలిపారు. ప్రస్తుతం చిన్నారి వైద్య చికిత్సకు సహకరిస్తోందని చెప్పారు. కాగా, తాజా కేసుతో పుదుచ్చేరిలో హెచ్‌ఎమ్‌పీవీ కేసులు రెండుకు చేరాయి. గతవారం మూడేండ్ల చిన్నారి ఈ వైరస్ బారిన పడిన విషయం తెలిసిందే. చికిత్స తర్వాత పూర్తిగా కోలుకొని డిశ్చార్జ్ అయ్యింది. తాజా కేసుతో కలిపి భారత్‌లో హెచ్‌ఎమ్‌పీవీ కేసులు 18కి చేరాయి.

# ఆ సర్వే ఆధారంగానే కొత్త రేషన్ కార్డుల జారీ!

మొదటి పేజీ తరువాయి...

రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితా సిద్ధం చేశారు. కొత్త ఆహార భద్రత కార్డుల జారీ సంబంధించి విధి విధానాలు ఇలా ఉన్నాయి. కుల గణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్ కార్డు లేని కుటుంబాల జాబితా జిల్లా కలెక్టర్లు/జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు క్షేత్రస్థాయి పరిశీలనకు పంపించబడుతుంది. మండల స్థాయిలో ఎంపీడీఓ/యూఎల్‌బీలో మున్సిపల్ కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులు. జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)/డీసీఎస్‌ఓ పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు. ముసాయిదా జాబితాను గ్రామసభ లేదా వార్డు సభలో ప్రదర్శించి చదివి వినిపించి చర్చించిన తర్వాత ఆమోదిస్తారు. గ్రామ సభ లేదా వార్డు సభల ద్వారా ఆమోదించబడిన లబ్ధిదారుల అర్హత జాబితాను మండల / మున్సిపాల్ స్థాయిలో ఇచ్చిన లాగిన్‌లో నమోదు చేసి జిల్లా కలెక్టర్ / జీహెచ్‌ఎంసీ కమిషనర్ లాగిన్‌కు పంపాలి. ఆ విధంగా పంపిన జాబితాను జిల్లా కలెక్టర్ / జీహెచ్‌ఎంసీ కమిషనర్ పరిశీలించి సంతృప్తి చెందితే పౌరసరఫరాల శాఖ కమిషనర్ లాగిన్‌కు పంపాలి. ఫైనల్ లిస్ట్ ప్రకారం సీసీఎస్ కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తారు. అర్హత కలిగిన వ్యక్తి ఒకే ఒక్క ఆహార భద్రత కార్డులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఆహార భద్రత కార్డుల్లో సభ్యుల చేర్పులు, తొలగింపులు చేయాలి. ఈ నేపథ్యంలో ఈ నెల 26 నుంచి అర్హత ఉన్న కుటుంబాలు కొత్త ఆహార భద్రత కార్డులు పొందుతారని విడుదల చేసిన మార్గదర్శకాల్లో పేర్కొందని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు.

# వెలుగు జిలుగుల మధ్య రాజేంద్రనగర్ సర్కిల్‌లో భోగి వేడుకలు



హైదర్‌గూడ లక్ష్మీ రామ్ హరన్ అపార్ట్ మెంట్ ఆవరణలో సోమవారం ఉదయం భోగి మంటలు వేసిన అపార్ట్ మెంట్ వాసులు



హైదర్ గూడ జనప్రియ హితోపియ వద్ద భోగి మంటలు



హైదర్ గూడలోని దేవాలయంలో భోగి మంటలు వేస్తున్న ఎం బాలసుబ్రమణ్యం దంపతులు



బాబుల్‌రెడ్డి నగర్‌లో భోగి మంటల్లో పాల్గొన్న సోమ శ్రీనివాస్ గుప్తా తదితరులు



మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేశ్ ఇంటి వద్ద భోగి మంటలు

బుద్వేల్, జనవరి13(ప్రభాత ఉదయం) : భోగి మంటల వెలుగు జిలుగుల మధ్య రాజేంద్రనగర్ సర్కిల్ లో సంక్రాంతి ఉత్సవాలు ప్రారంభమైనాయి. అత్తాపూర్ లక్ష్మీరామ్ హరన్ అపార్ట్ మెంట్ వాసులు సోమవారం ఉదయాన్నే ఆపార్ట్ మెంట్ ముందు భోగి మంటలు వేసుకుని సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు భోగి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు మ్యాడం మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. హైదర్ గూడ జనప్రియ హితోపియ ఆపార్ట్ మెంట్ వద్ద పెద్ద ఎత్తున భోగి మంటల లో ప్రజలు పాల్గొన్నారు. హైదర్ గూడ దేవాలయం వద్ద ఎం బాలసుబ్రమణ్యం దంపతులు భోగి మంటలు వేశారు. బాబుల్ రెడ్డినగర్ లో మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేశ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా ల ఆధ్వర్యంలో వేర్వేరుగా భోగి మంటలు వేసి సంబరాలు చేసుకున్నారు.



ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలు

## బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

రాజేంద్రనగర్, జనవరి 13(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ డివిజన్ బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు గడిలా పద్మావతి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ హరి హర శేత్రం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సుమారు 60 కి పైగా మహిళలు, పిల్లలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో విజయలక్ష్మి, రెండవ స్థానంలో గడిలా షాలిని, మూడో స్థానంలో సరస్వతి, నాలుగో స్థానంలో దీపికా , ఐదవ స్థానంలో స్నేహ లు నిలిచి బహుమతులను గెలుచుకున్నారు. ఈ ముగ్గుల పోటీలకు ప్రముఖ చిన్న పిల్లల నిపుణులు డాక్టర్ అమరేందర్, ఆయన సతీమణి ఉష రాణి లు పాల్గొని బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అమరేందర్ మాట్లాడుతూ... ముగ్గుల పోటీలు మహిళల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయటానికి ఎంతో దోద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు జి బాబురావు, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు రమాదేవి, ,ప్రధాన కార్యదర్శి సప్నా రెడ్డి, కవిత ,ఎస్సీ మోర్చ అధ్యక్షులు తొండు పల్లి మల్లేష్, ప్రధాన కార్యదర్శి ఇ. వేణుగోపాల్ , స్థానిక నాయకులు వై.గోపాల్, ధీరజ్ యాదవ్, దయాకర్, సునీత ,సరితా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బిఆర్ఎస్ యువనేత కార్తీక్ రెడ్డిని కలిసిన బాబు రెడ్డి నగర్ నాయకులు

## రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన బి ఆర్ ఎస్ యువనేత కార్తీక్ రెడ్డి

రాజేంద్రనగర్, జనవరి 13(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలకు బిఆర్ఎస్ యువనేత పి కార్తిక రెడ్డి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం సంక్రాంతి పండుగ పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ చెందిన మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కార్తీక్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



## ఘనంగా శ్రీ తిమ్మప్ప స్వామి కళ్యాణం

మల్దకల్, జనవరి 13(ప్రభాత ఉదయం) ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం శ్రీ తిమ్మప్ప స్వామి కళ్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు, ఏవో సత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మధుసూదనచారి ,రవి వేద మంత్రాలతో స్వామివారి కళ్యాణాన్ని జరిపించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు అనంతరం ప్రసాదం వితరణ చేశారు.



చిన్నారి తన్వీకి భోగి పండ్లు పోస్తున్న తల్లి తేజస్వీ

## భోగి పండుగ రోజు చిన్నారులకు భోగి పండ్లు పోసిన తల్లి తండ్రులు

బుద్వేల్, జనవరి 13(ప్రభాత ఉదయం) : భోగి పండుగ రోజున చిన్నారులకు వారి తల్లిదండ్రులు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. బుద్వేల్ కు చెందిన తేజస్వీ - దిలీప్ ల కుమార్తె తన్వీ కి సోమవారం భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు.

డాక్టర్ మంద జగన్నాథం పార్థివ దేహాన్ని నివాళులర్పిస్తున్న మందకృష్ణ మాదిగ, గద్వాల జిల్లా నాయకులు

## మాజీ ఎంపీకి మంద జగన్నాథంకు ఘనంగా నివాళులర్పించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ






గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 13(ప్రభాత ఉదయం) హైదరాబాద్‌లో చంపపేటలో మాజీ ఎంపీ, సీనియర్ రాజకీయ నాయకుడు మంద జగన్నాథం పార్థివ దేహాని సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా ప్రజాప్రతినిధులు,రాజకీయ నాయకులు, అభిమానులు సందర్శించి, పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో ఏఐసిసీ కార్యదర్శి సంపత్ కుమార్, రాష్ట్ర స్పోర్ట్స్ ఆథారిటి మాజీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి శ్రీనివాసులు, నాగర్ దొడ్డి వెంకట్రాములు, అమరవాయి మాజీ ఎంపీటీసీ రోషన్న, కౌన్సిలర్ వడ్డేపల్లి అజయ్ కుమార్, తదితరులు ఉన్నారు.

## ట్రాప్ కెమెరాలలో కనిపించని చిరుత ఆచూకి

రాజేంద్రనగర్, జనవరి13 ( ప్రభాత ఉదయం) : వ్యవసాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ లో ఆదివారం ఏర్పాటు చేసిన యానిమల్ ట్రాప్ కెమెరాలను సోమవారం ఉదయం పరిశీలించిన అటవీ శాఖ అధికారులకు చిరుత ఆచూకి కనిపించలేదు. తిరిగి సోమవారం కూడా శంషాబాద్ డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సయ్యద్ కమాలుద్దీన్ ఆధ్వర్యంలో వర్సిటీ క్యాంపస్ లోని అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మార్నింగ్ వాక్ చేసే వారికి వారం రోజుల క్రితం చిరుత పులి కనిపించిందని ఊహాగానాలు వినిపించడంతో అటవీ శాఖ అధికారులు ఆదివారం నాలుగు యానిమల్ ట్రాఫ్ కెమెరాలను ఏర్పాటు చేశారు. చిరుత పులి సంచారం గురించి ఊహగానాలు వెలువడుతుండటంతో వ్యవసాయ విశ్వవిద్యాలయం, నార్మ్, మెనేజ్ సంస్థలలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులను ఆలర్ట్ చేశారు. రాత్రి వేళలలో జాగ్రత్తగా ఉండాలని పై అధికారులు సూచిస్తున్నారు.

## మన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రధానం చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన పోటీలలో మహిళలు వేసిన ముగ్గులు

రాజేంద్రనగర్, జనవరి 13(ప్రభాత ఉదయం) మన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అన్నారు. సోమవారం గ్రేటర్ హైదరాబాద్ మహిళా జాంధ్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల రంగోలి ముగ్గుల పోటీలు శ్రీ భవాని మాత దేవాలయము, పద్మశాలీపురం, కాటేదాన్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముగ్గుల పోటీల్లో 52 మంది మహిళలు పాల్గొన్నారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి ప్రేమదాస్ గౌడ్ , కార్పొరేటర్ పావని , నాయకులు ప్రేమ గౌడ్, మసున వెంకటేష్ , గంజి వెంకటేష్ , కాశీగారి యాదగిరి , కౌన్సిలర్ లక్ష్మి నారాయణ , ఆర్గనైజర్లు పోట్ల రామస్వామి , బుగిడి అనూప్ , కమర్తి ఎల్లప్ప , విభూతి శ్రీనివాస్ , గడిగె మంజుల , విభూతి రేవతి , కమర్తి భారతి , లక్ష్మి , స్వప్న , బాల కృష్ణ , కిషోర్, లింగప్ప , శ్రీధర్ , నరేష్ పాల్గొన్నారు



కొండపోచమ్మ వద్ద నీటిలో మునిగి మృతి చెందిన సాయిల్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎంపీ హనుమంతరావు

## మృతిచెందిన సాహిల్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎంపీ వి హనుమంతరావు

రాజేంద్రనగర్, జనవరి 13(ప్రభాత ఉదయం) అత్తాపూర్ డివిజన్ పరిధిలోని ఎస్ పి నగర్‌లో సాహిల్ కొండ పోచమ్మ సాగర్ లో నీటిలో పడి మృతి చెందాడు. సాహిల్ కుటుంబ సభ్యులను మాజీ రాజసభ సభ్యులు వి. హన్మంతురావు పరామర్శించి కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అంద చేశారు. ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందెల కృషి చేస్తానన్నారు . ఈ కార్యక్రమం లో కల్లు గీత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముద్దగౌని భాస్కర్ గౌడ్, కాంగ్రెస్ అత్తాపూర్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ నాగరాజు ,మధుబాబు , బోయ రమేశ్ , అర్జున్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ షాక్‌తో డ్రైవర్ మృతి

### కరెంటు షాక్‌తో ఓ డ్రైవర్ మృతి

బుద్వేల్, జనవరి13(ప్రభాత ఉదయం): అల్యూమీనియం లోడ్‌తో ఉన్న డీసీఎం ను విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ పక్కన ఆపి డీసీఎం డోర్ తీసి క్రిందకు దిగుతుండగా షాక్ తగిలి డీసీఎం డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి... కర్ణాటక కెఎస్ ఆర్టీసీ కాలనీ కి చెందిన మీర్జా అసద్ బేగ్ (54), జడ్చర్ల కు చెందిన ఖాజా పాష లు డీసీఎం నెంబర్ టీఎస్ 09 యూసీ 1317లో కడప నుంచి అల్యూమీనియం ముడి సరుకు ను తీసుకుని సోమవారం ఉదయం కాటేదాన్ కు వచ్చారు. కాటేదాన్ లోని సిటిజన్ కాంటా పక్కన గోదాములో సగం అల్యూమీనియం ముడి సరుకును అన్ లోడ్ చేశారు. మిగతా సగం సరుకు ను వేరే గోదాములో మద్యాహ్నాం 2 గంటలకు ఆన్ లోడ్ చేయాలని సదరు యజమాని చెప్పడంతో డీసీఎం ను పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ పక్కన అవడానికి వెళ్లాడు. డీసీఎం లో ఉన్న మరో డ్రైవర్ ఖాజా పాషా క్రింద దిగి నిలిచి ఉన్నాడు. డీసీఎం ను నడిపిస్తున్న మీర్జా అసద్ బేగ్ డీసీఎం ను అపి డోర్ తీయగా పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ తీగెలకు తగిలింది. డీసీఎం డోర్ తగలగానే కరెంటు షాక్ కొట్టింది. డ్రైవర్ మీర్జా అసద్ బేగ్, ఆక్కడిక్కడే పడి మృతి చెందాడు. పోలీసుల ద్వారా సమాచారం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న మృతి చెందిన డ్రైవర్ అసద్ బేగ్ బావ అబ్దుల్ నసీర్ ఫిర్యాదు ఇచ్చిన మేరకు మైలార్దేవుపల్లి డీఐ మక్సూద్ అలీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




# నేడు సాయంత్రం 6 గంటలకు... మకర జ్యోతి

తిరువనంతపురం, జనవరి 13(ప్రభాత ఉదయం) సంక్రాంతి సందర్భంగా కేరళ శబరిమలలో మకరజ్యోతిని ప్రత్యక్షంగా వీక్షించేందుకు లక్షలాది మంది భక్తులు అక్కడికి చేరుకున్నారు. రేపు సాయంత్రం 6-7 గంటల మధ్య జ్యోతి దర్శనం ఇస్తుంది. ఎన్నో దశాబ్దాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. ఆకాశంలో నక్షత్రంలా కనిపించే ఈ కాంతిని దర్శించుకుంటే జీవితంలో సుఖ, సంతోషాలు కలుగుతాయని ప్రజల నమ్మకం. అక్కడికి వెళ్లలేకపోయినా టీవీలో వీక్షించేందుకు కోట్లాది మంది ఎదురుచూస్తున్నారు.



స్వామివారి పల్లకి మోస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## భోగి సంక్రాంతి సందర్భంగా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దర్శించుకున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, జనవరి 13(ప్రభాత ఉదయం) మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి భోగి పండుగ సందర్భంగా యాధాద్రి (యాదగిరి గుట్ట )శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు ముఖ్యంగా మల్కాజిగిరి నియోజక వర్గ ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని ఆ స్వామి వారిని కోరుకున్నారు.



మాజీ ఎంపీ మంద జగన్నాథం భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న మాజీ జెడ్పిటిసి వడ్డేపల్లి శ్రీనివాసులు

## మాజీ ఎంపీ, సీనియర్ రాజకీయ నాయకుడు మంద జగన్నాథం పార్థివ దేహానికి నివాళులు అర్పించిన నాయకులు

అలంపూర్, జనవరి 13(ప్రభాత ఉదయం) నాగర్ కర్నూల్ మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మందా జగన్నాథం పార్థివ దేహానికి అలంపూర్ నియోజక వర్గం నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం హైదరాబాద్ లోని చంపాపేట్ లోని వారి స్వగృహంలో మాజీ ఎంపీ డాక్టర్ మంద జగన్నాథం గ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణించడం జరిగినది విషయం తెలిసిన వెంటనే వడ్డేపల్లి మాజీ జడ్పిటిసి శ్రీనివాసులు వెళ్ళి వారి భౌతికకాయానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అమరవాయి మాజీ ఎంపిటీసీ రోషన్న కౌన్సిలర్ వడ్డేపల్లి అజయ్ కుమార్ , రమేష్, నంద, జోగి మహేష్, తదితరులు పాల్గొన్నారు.




## మాజీ ఎంపీ మంద జగన్నాథంకు ఘన నివాళి

కొత్తకోట, జనవరి 13(ప్రభాత ఉదయం) కొత్తకోట మున్సిపల్ కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర మాజీ ఎంపీ మంద జగన్నాథం కు అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు జనంపల్లి ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ మంద జగన్నాథంకు రాజకీయ పార్టీలకు అతీతంగా సోమవారం జగన్నాథం చిత్రపటానికిపూలమాలలు వేసి ఘనంగానివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంద జగన్నాథం ఆయన రాజకీయ ప్రస్థానంలో ప్రజలకు ఎనలేని సేవలు చేశారని ఆయన మరణం తీరని లోటని చెప్పారు. మాదిగ జాతికి చేసిన సేవ మరువలేనివని, ఆయన ఆశయాలను కొనసాగించాలని అన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్,టిఆర్ఎస్, బిజెపి పార్టీ నాయకులు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# చైతన్య విలాస్ కాలనీ రామాలయంలో ఘనంగా తిరు కళ్యాణోత్సవాలు



తిరు కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

బుద్వేల్, జనవరి13(ప్రభాత ఉదయం) :హైదర్ గూడ చైతన్య విలాస్ కాలనీలోని శ్రీ సీతారామ చంద్రస్వామీ దేవాలయంలో ధనుర్మాసం సందర్భంగా సోమవారం తిరు కళ్యాణోత్సవ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసా చార్యుల తో పాటు మరో ముగ్గురు వేధ పండితుల ఆధ్వర్యంలో జరిగిన తిరు కళ్యాణోత్సవాలలో 24 జంటలు పాల్గొని కళ్యాణం జరిపించారు. పూజలలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు కె.మురళీ, జే. మహేశ్, డి.రాజేశ్ కుమార్, డాక్టర్ వాసుదేవరావు, ఆదర్శ్ శు క్లా, పద్మశ్రీ లు భకు లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ జాగ్రత్తలు తీసుకున్నారు.

**నెల రోజుల పాటు తిరుప్పావై ప్రవచనాలు చెప్పిన టీకేవీఆర్ అభిరామ్ కు ఘన సన్మాణం :**

ధనుర్మాసంలో బాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో డిసెంబరు 16 నుంచి సోమవారం వరకు నెల రోజుల పాటు తిరుప్పావై ప్రవచనాలు చెప్పి భక్తులను అద్యాత్మిక మార్గంలో నడిపించిన వేధ పండితులు టీకేవీఆర్ అభిరామ్ ను దేవాలయ కమిటీ ఆద్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టులో భాగంగా నెల రోజుల పాటు చైతన్య విలాస్ కాలనీలోని రామాలయంలో తిరుప్పావై ప్రవచనాలను బోధించారు.



తిరు కళ్యాణ మహోత్సవం

# ఘనంగా శ్రీ సుందరగిరి పరమేశ్వరుడి జాతర

## శ్రీ పరమేశ్వరుడిని దర్శించుకున్న వందలాది భక్తులు



శ్రీ సుందరగిరి పరమేశ్వర స్వామి జాతర సందర్భంగా స్వామివారిని దర్శించుకున్న కొత్తకోట ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ జీవి జయప్రకాష్ దంపతులు, పురోహితులు విజయ్



పరమేశ్వరుడిని దర్శించుకున్న రామకృష్ణాపురం గ్రామం స్వర్గీయ పటేల్ వెంగల్ రెడ్డి కుటుంబ సభ్యులు

కొత్తకోట, జనవరి 13(ప్రభాత ఉదయం) కొత్తకోట మండలంలోని అప్పారాల గ్రామంలో వెలసిన శ్రీ సుందరగిరి పరమేశ్వరుడి జాతర భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది.శ్రీపరమేశ్వరుని జాతర సందర్భంగా ప్రతి ఏడాది జరుపుకునే అగ్నిగుండం లో భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణాపురం గ్రామ బి ఆర్ ఎస్ అధ్యక్షులు మూలమల్ల యుగంధర్ రెడ్డి , రామ్ చరణ్ రెడ్డి, కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో పరమేశ్వరుడి కి అభిషేకం నిర్వహించారు. కొత్తకోట శ్రీ వేంకటేశ్వర ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ జీవి జయప్రకాష్ దంపతులు , పురోహితులు విజయ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఇండ్ల ముందు ముగ్గులు వేస్తున్న మహిళలు

# గద్వాల జిల్లాలో ఘనంగా భోగి సంబరాలు

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 13(ప్రభాత ఉదయం)జిల్లా వ్యాప్తంగా భోగి సంబరాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయమే పల్లె, పట్టణాల్లో ఇళ్ళ వాకిళ్ల ముంగిట రంగురంగుల ముత్యాల ముగ్గులతో ముంగిళ్ళను అందంగా అలంకరించారు. ఆయా ప్రాంతాల్లో వారివారీ ఇళ్ల ఎదుట మహిళలు ముత్యాల ముగ్గులు వేయడంలో పోటీ పడ్డారు. ముత్యాల ముగ్గులను వేసి అందులో రంగులు నింపడంలో మహిళల సృజనాత్మక కళ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. చిన్నారులకు భోగి పండ్లతో స్నానం చేయించారు. చిన్నారులు, యువకులు గాలి పటాలను ఎగురవేశారు.గద్వాల పట్టణంలో.... గద్వాల పట్టణంలోని భోగి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని కాలనీల్లో మహిళలు ఉదయమే ఇండ్ల ముందు ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. దీంతో కాలనీలన్నీ రంగుల మయంగా మారాయి.




భోగి మంటల వద్ద మహిళలు



ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ కు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపుతున్న సీనియర్ పాత్రికేయులు ఆప్పారెడ్డి గూడెం భీమయ్య కుటుంబ సభ్యులు

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన సీనియర్ పాత్రికేయులు అప్పారెడ్డిగూడెం భీమయ్య కుటుంబ సభ్యులు

ఆప్పారెడ్డి గూడెం, జనవరి 13( ప్రభాత ఉదయం): షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను రాజేంద్రనగర్ కు చెందిన సీనియర్ పాత్రికేయులు అప్పారెడ్డిగూడెం కు చెందిన ఏ భీమయ్య కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల ఛైర్మన్ వీర్లపల్లి శంకర్ ను కలిసారు. వీర్లపల్లి శంకర్ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని భగవంతుని ప్రార్థిస్తున్నాన న్నారు. వీర్లపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ గా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన శంకర్ అంచెలంచలుగా ఎదిగి ఎమ్మెల్యే కావడం సంతోషకరమైన విషయం అన్నారు. నిజాయితీకి మారుపేరుగా వీర్లపల్లి శంకర్ నిలిచాడన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన సంవత్సర కాలంలోనే నియోజకవర్గంలో అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపడుతూ ముందుకు సాగుతున్న ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ఇచ్చి ఆశీర్వదించాలన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను కలిసిన వారిలో సీనియర్ పాత్రికేయులు అప్పా రెడ్డిగూడెం భీమయ్య తో పాటు ఆయన సతీమణి ఎ .మాధవి, కుమారుడు ఎ .శశాంక్ లు ఉన్నారు.

## అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడుగా సులిగె వెంకటేశ్



బుద్వేల్, జనవరి 13 (ప్రభాత ఉదయం) బీజేపీ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడుగా హైదర్ గూడ కు చెందిన సులిగె వెంకటేశ్ ను నియమిస్తు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సులిగె వెంకటేశ్ మాట్లాడుతూ, బీజేపీ హైదర్ గూడ వార్డు అధ్యక్షునిగా రాజకీయ జీవితం ప్రారంబించి డివిజన్ కార్యదర్శిగా, మీడియా సెల్ కన్వీనర్ గా, రాజేంద్రనగర్ సర్కిల్ మీడియా సెల్ ఇంచార్జీగా పనిచేశానన్నారు. అనంతరం రంగారెడ్డి జిల్లా యువమోర్చ కార్యదర్శిగా, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా పార్టీ కోసం సేవలను అందిం చానన్నారు. అత్తాపూర్ డివిజన్ లో పార్టీని మరింత పటిష్టం చేసి రాబోయే రోజులలో ఎలాంటి ఎన్నికలు వచ్చినా పార్టీని గెలిపించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకముంచి పార్టీ డివిజన్ అధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్క నాయకునికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు..

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608